


## వి.వి.సుబ్బరాజు

# మార్నింగ్ వాక్

ఆహ్వానం!

మీరు తెలుగువారా?

అయితే ఉదయం 8, 9 గంటల మధ్య ఇక్కడే కలుద్దాం రండి!

-సుబ్బరాజు

(తూ.గో.జిల్లా)

* * *

వాషింగ్‌టన్ డి.సి.-నెవార్కు - సాలమ్ విలేజ్.

ఓకాడ్లే రోడ్, అపార్టుమెంట్ ఫస్టు ఫ్లోర్ నుంచి కిందికి దిగాను. బయట బాగా చలిగా ఉంది. లెదర్ జాకెట్టు, మంకీకాప్, చేతులకు గ్లోవ్స్ వేసుకొని వాకింగ్‌కి బయలుదేరాను.

ఎదురుగా టెన్నీస్ కోర్టులు. వాటి పక్కనే స్విమ్మింగ్ పూల్స్, చలికాలం కావడం వల్ల నిర్మానుష్యంగా ఉన్నాయి. స్విమ్మింగ్ పూల్ ఫెన్సింగ్ ఆనుకొని చిన్నపిల్లల 'క్రియేటివ్ టాలెంట్స్ లెర్నింగ్ సెంటర్' ముంగిట్లోంచి నడుస్తున్నాను. పిల్లల కిలకిలలు, కేరింతలు వినబడడం లేదు. పిల్లలు ఆడుకునే వస్తువులన్నీ విశ్రాంతి తీసుకొంటున్నాయి. ఇంకా పిల్లలు వచ్చే సమయం కాలేదు. నేను తిరిగి వచ్చే సమయానికి సందడిగా ఉంటుంది.

సాలమ్ విలేజ్-2లోకి ప్రవేశించాను. ఫుట్‌పాత్‌ని ఆనుకొని పెద్ద మెయిన్ బాక్స్, ఆ లైనులో ఉన్న కాపురాలకు 'టపా' ఆ పెద్ద డబ్బా అరలలో ఉంచుతారు. ఎవరి అరను వారు తెరుచుకొని టపా తీసుకుంటాం. మన కన్నా ఇక్కడ పోస్టల్ సర్వీస్ వినియోగం చాలా ఎక్కువ. ఫుట్‌పాత్ మీద ఎదురుపడ్డ నల్ల జాతీయుడు 'హాయ్!' అంటూ ఆత్మీయమైన పలకరింపు. ఇక్కడ జనం నల్లవారైనా, తెల్లవారైనా ఆడా మగా నవ్వుతూ ఎదురుపడ్డ వారిని విష్ చేయడం వారి సాంప్రదాయం. స్కూల్ బస్సు కోసం వెయిట్ చేస్తున్న చిన్నపిల్లలు వరుసగా క్యూలో నిలబడ్డారు. అంతా నియమం తప్పకుండా క్యూ పాటిస్తారు. వారిని విష్ చేసి ముందుకు నడిచాను.

కార్నర్‌లో 'ట్రాష్ సెల్యూషన్స్' పెద్ద డస్టబిన్‌లు. తళతళా మెరిసిపోతున్న కొత్త బెంజికారు అక్కడ ఆగింది. దానిలో నుండి ఓ తెల్ల జంట దిగి డిక్కీ తెరచి అందులో ఉన్న చెత్తబస్తాలను, డస్ట్‌బిన్‌లో వేసి వచ్చినంత వేగంగానూ వెళ్లిపోయారు. పరిసరాలు శుభ్రంగా ఉంచడానికి అంతా శ్రద్ధ తీసుకుంటారు. కానీ సిగరెట్ పీకలు మాత్రం అంతటా దర్శనమిస్తూ ఉంటాయి.

సాలమ్ విలేజ్ దాటి ప్రైవేట్ ప్రాపర్టీలోకి అడుగుపెట్టాను. మార్నింగ్‌వాక్‌లో నేను చూసిన మనుషుల కన్నా వాహనాలే అత్యధికం. ప్రశాంత వాతావరణం. వెనుకనే ఫారెస్టు ఏరియా. ఎత్తయిన చెట్లు. నవంబర్ నెల వరకూ రంగు రంగుల ఆకులతో మనోహరంగా కనువిందు చేసిన చెట్లు ఇప్పుడు మోడుబారిపోయాయి. అక్కడక్కడా కనిపించే క్రిస్మస్ ట్రీలు తప్ప మరెక్కడా పచ్చదనం లేదు. విపరీతమైన చలి, ఆపైన మధ్యమధ్య మంచు పడడం వల్ల నేల మీద పచ్చగడ్డి కూడా చచ్చిపోతోంది.

సాలమ్ విలేజ్-1లోకి వచ్చాను. చిన్నపిల్లల పార్క్ ఉయ్యాలలు, జారుడుబల్లలు, తూగుడుబల్లలు, పులప్స్‌బార్‌లు ఉన్నాయి. దాటి ముందుకు నడిచేసరికి రోడ్డు పక్కన 'ది న్యూస్ జర్నల్' డైలీ న్యూస్‌పేపరు డబ్బా. ఆదివారం పేపరు ధర ఒకటిన్నర డాలర్లు. మిగిలిన రోజుల్లో యాభై సెంట్లు. కాయిన్స్ వేసి బటన్ ప్రెస్ చేస్తే న్యూస్‌పేపర్ బయటకు వస్తుంది. పేపరు మొదటి పేజీలో ఉన్న వార్తలు, వార్తా చిత్రాలు గ్లాసులోంచి కనిపించినంత మేరా చదివేసి ముందుకు నడిచాను. ఎవరో భూతదయాపరుడు తన పెంపుడు కుక్కను స్వెట్టర్ తొడిగి మరీ వాకింగ్‌కు తీసుకు వచ్చాడు.

జంక్షన్‌కి చేరాను. మెత్తగా దూసుకుపోతున్న వాహనాల ప్రవాహం! ట్రాఫిక్ సిగ్నల్స్‌ని ఫాలో అవుతూ ఏ విధమైన హారన్ మోతలు లేకుండా సాగిపోవడం చూడముచ్చటగా ఉంది. వాకింగ్ సిగ్నల్ పడగానే రోడ్డు క్రాస్ చేసి ముందుకు నడిచాను. జంక్షన్ కార్నర్‌లో 'డంకన్ డునట్స్' 'వావా' ఫుడ్ మార్కెట్, కాఫీ షాపు. కుడిపక్కన విశాలమైన ఆవరణలో క్రిస్టియానా హైస్కూలు, ఎత్తయిన జెండా స్తంభానికి అమెరికా జాతీయపతాకం సగర్వంగా ఎగురుతోంది. అందమైన భవన సముదాయం, ఆడిటోరియం, పెద్ద ఆటస్థలం, టెన్నీస్‌కోర్టులు, బాస్కెట్ బాల్, రగ్బీకోర్టులు, మేట్ పరచిన రన్నింగ్ ట్రాక్, ప్రేక్షకులు కూర్చునేందుకు స్టేడియం స్టాండులు, స్కూలు గ్రౌండ్‌కి ఎదురుగా 'డ్రగ్స్ ఫ్రీ స్కూలు' అన్న బోర్డు.. వాటిని పరికిస్తూ బస్సు షెల్టర్‌లో బెంచి మీద కూర్చున్నాను.

ప్రతీరోజూ నా కన్నా ముందుగా వచ్చి బస్సు షెల్టర్‌లో కూర్చుని ఉండే హనుమంతరెడ్డి ఈ రోజు ఇంకా రాలేదు. మేము కలుసుకుని ఐదు రోజులయ్యింది. శని, ఆదివారాలు వాకింగ్ లేదు. ఇంట్లో వాళ్లతో బయటకు పోవడం వల్ల వీలు కాదు. గురు, శుక్రవారాలు విపరీతంగా మంచు పడింది. ఇంట్లోనే ఉండిపోయాను. సోమవారం ఉదయం ఆత్రంగా మిత్రుడ్ని కలవాలనుకుంటే తాను ఇంతవరకూ పత్తా లేదు.

సాధారణంగా ఇండియా నుంచి వచ్చే పేరెంట్స్ చలికాలంలో రారట. నాకయితే ఇప్పుడే వీలు చిక్కింది. వీకెండ్స్ శని, ఆదివారాలు షాపింగ్, సైట్‌సీయింగ్, పార్టీలు, ఫంక్షన్‌లకు బయటకు తిరిగినా మిగిలిన రోజులు గృహనిర్బంధంలా ఉంటుంది. అక్కడకీ మా వాళ్లు నా కోసం టీవీలో తెలుగు, హిందీ ఛానల్స్ కనెక్షన్ తీసుకున్నారు. నెట్‌లో మన పత్రికలు చూడవచ్చును.

సినిమా సీడీలు ఉండనే ఉంటాయి. అయినా నిత్యం జనం మధ్య తిరిగేవాళ్లకు ఆ ఏర్పాట్లు తృప్తిని కలిగించవు. కాలక్షేపం కబుర్లు చెప్పుకోవడానికి కాస్త సమవయస్కులు దొరికితే బావుంటుందని తరుచూ అనిపిస్తూ ఉండేది. అప్పుడే చిన్న చిట్కాతో హనుమంతరెడ్డిని పట్టుకున్నాను.

"మీరు తెలుగువారా? అయితే ఉదయం 8, 9 గంటల మధ్య ఇక్కడే కలుద్దాం! రండి!" సుబ్బరాజు (తూ.గో.జిల్లా) అని రాసిన పోస్టెడ్ స్లిప్‌ని బస్సు షెల్టర్ గోడ మీద ఉన్న 'డార్ట్' బస్సుల టైంటేబుల్ చార్ట్ కిందనే అటూ ఇటూ ఉన్న రెండు బస్సు షెల్టర్లలోనూ అతికించాను. వరుసగా మూడు రోజులు అదే సమయానికల్లా బస్సు షెల్టరుకి వెళ్లి ఓపిగ్గా ఎదురుచూశాను. ఎవరూ రాలేదు. తెలుగు వాళ్లు ఆ ప్రాంతంలో ఎక్కువగానే ఉన్నారు. ఇక నా ప్రయత్నం వృధాయే అనుకొంటున్న తరుణంలో కరీంనగర్‌కి చెందిన హనుమంతరెడ్డి ఆ షెల్టర్‌లో నా కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. నన్ను చూడగానే "నువ్వేనా సుబ్బరాజు!" అంటూ కౌగిలించేసుకున్నాడు.

ఇద్దరం సమవయస్కులం కావడం. పరిచయం అప్పుడే అయినా స్వదేశంలో కాకుండా ప్రవాసంలో కావడం వల్ల తక్కువ సమయంలోనే మామధ్య సాన్నిహిత్యం ఏర్పడిపోయింది. ఒకే రకమైన ఒంటరితనంతో సతమతమవుతుండడం వల్ల తనవితీరా మాట్లాడేసుకున్నాం. తాను ఉండేది బస్సు షెల్టర్ వెనుక ఉన్న 'గ్లెన్ ఈగల్ విలేజ్'.

కొత్తగా కలిసిన సందర్భంగా ఇద్దరం కాఫీ తాగుదాం అనుకున్నాం. డంకన్ డూనట్స్ కాఫీ షాపుకి వెళ్లాం. నాలానే తనకీ పిల్లలతో కాకుండా విడిగా షాపులకు వెళ్లే అవసరం లేదు. తొలిసారిగా మేముగా షాపుకి వెళ్లాం.

డబ్బులు చెల్లించాలి. కాఫీ మమ్మల్నే చేసుకోమని మరుగుతున్న డికాషన్ పాట్‌లను చూపించాడు సేల్స్‌మెన్. అందులో ఏది బావుంటుందో? ఏది బావుండదో? మాకు తెలియదు. స్ట్రాంగ్ కాఫీ కావాలి కలిపి ఇవ్వమని అడిగాం. కౌంటర్‌లో బిజీగా ఉన్నాను. కొంచెం సేపు ఆగండి అన్నాడు సేల్స్‌మెన్.

అక్కడకు కాఫీకి వచ్చిన బంగ్లాదేశ్ అమ్మాయి మా ఇబ్బంది గ్రహించినట్లుంది. తానుగా మా దగ్గరకు వచ్చి "మనం మనం ఇరుగు పొరుగు దేశీయులం. ఆ మాత్రం సహాయం చేసుకోవాలి!" అంది నవ్వుతూ. నేను కూడా మాట కలిపాను.

"ఒకప్పుడు మనం ఒకే దేశం వాళ్లం. మీ దేశం పాకిస్తాన్ నుంచి విడిపోయే సందర్భంలో మీ స్వాతంత్ర్యం పోరాటానికి మేము చాలా ఆర్థిక భారం మోసాం. బంగ్లాదేశ్ రిలీఫ్ ఫండ్ పేరిట పోస్టుకార్డు నుంచి సినిమా టికెట్ల వరకూ ప్రత్యక్ష పరోక్ష పన్నుల భారం మోసి మీకు సహాయపడ్డాం. అప్పటి మా ప్రధాని ఇందిరాగాంధీ తన రాజకీయ చతురతతో మీకు స్వేచ్ఛను కల్పించింది" అంటూ చరిత్ర పాఠం చెప్పేశాను. ఆ అమ్మాయి "రియల్లీ! రియల్లీ!!" అంటూ ఆశ్చర్యపోయింది.

"మీ ఉద్యమకాలంలో మా 'రవీంద్రనాథ్ ఠాగూర్' రాసిన 'సోనార్‌బంగ్లా' అన్న గీతాన్ని జాతీయ గీతంగా మీరు పాడుకునే వారు. మేము మీకు అన్ని రకాలుగా నైతిక మద్దతు ఇచ్చాం. మీ పెద్దవాళ్లను అడిగి తెలుసుకో. నే చెప్పేది వాస్తవమో కాదో తెలుస్తుంది!" అన్నాను గుక్క తిప్పుకోకుండా.

"మీ నుంచి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాను. మీ పరిచయం చాలా సంతోషంగా ఉంది!" అంటూ మేము వద్దంటున్నా వినకుండా స్నాక్స్ తెచ్చి పెట్టింది. కాఫీ స్ట్రాంగ్‌గా చేసి ఇచ్చింది. తాను పీజీ చేస్తున్నట్లుగా చెప్పింది. మళ్లీ కలుద్దాం! అంటూ సెలవు తీసుకుంది.

నా మాటలకు మా హనుమంతరెడ్డి మరీ ఆనందపడిపోయాడు. "ఎప్పటి సంగతులో నీకు బాగా గుర్తున్నాయి రాజూ!" అంటూ నన్ను మెచ్చుకున్నాడు. "ఏమైనా మీ ఆంధ్రావాళ్లు మంచి మాటకారులు!" అన్నాడు ముక్తాయింపుగా.

"ఇదిగో రెడ్డిగారూ! అన్యాయం. తెలుగువాళ్లం మనమంతా ఒక్కటేనని నేననుకుంటుంటే నువ్వు పదవి లేని రాజకీయ నాయకుడిలా ఆంధ్రా-తెలంగాణా అని విడదీసి మాట్లాడ్డం ఏమీ బాగాలేదు!" అన్నా కోప్పడుతూ!

"ఇక అనన్లే!" అన్నాడు హనుమంతరెడ్డి పెద్దగా నవ్వేస్తూ. తరువాత మా మధ్య సాన్నిహిత్యం బాగా పెరిగింది.

హనుమంతరెడ్డి ఇంకా రాలేదు. వచ్చి ఉంటే ఈ సమయానికి షేర్‌వుడ్స్ ఫారెస్ట్ చుట్టి ట్రీవుడ్స్ ప్రాంతంలో ఈ ఐదు రోజుల మాటలు తనవితీరా చెప్పుకునేవాళ్లం. హనుమంతరెడ్డి ఇంకా రాలేదు. కారణం ఏమై ఉంటుందో తెలియదు. ఊహలు రకరకాలుగా పరిగెడుతున్నాయి. 'గ్లెన్ ఈగల్ విలేజ్'లోని వాళ్ల ఇంటికి బయలుదేరాను.

హనుమంతరెడ్డి కోడలు 'పావని' నన్ను సాదరంగా ఆహ్వానించింది. హనుమంతరెడ్డి తల్లిగారికి ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు ఇండియా నుంచి ఫోన్ రావడంతో నాలుగు రోజుల క్రిందటే హుటాహుటిన బయలుదేరి వెళ్లాడట. నాకు ఆ వార్త తెలియజేయనందుకు క్షమాపణలు కోరింది పావని. ఇప్పుడు ఆమె ఆరోగ్యం కుదుటపడిన సమాచారం చెప్పింది. దాంతో నా మనసు తేలిక పడింది.

నా కోసం కాఫీ కలపడానికి 'కిచెన్'లోకి వెళ్లింది పావని. నేను అక్కడే కంప్యూటర్ టేబుల్‌మీద పోస్టెడ్ స్లిప్‌లను తీసుకుని కొత్త వాకింగ్‌మేట్‌కి స్వాగతం పలుకుతూ ఆహ్వానపత్రం రాసి సిద్ధం చేసుకున్నాను. పావని ఇచ్చిన కాఫీ తాగి బస్సు షెల్టర్‌లో స్లిప్‌లు అతికించి మరీ ఇంటి దారి పట్టాను. నేను ఇంకా మూడు మాసాలు ఇక్కడే ఉండాలి. మార్నింగ్‌వాక్ సహచరుణ్ని వెదుక్కునే ప్రయత్నంలో పడ్డాను.

